
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 10 మార్చి 2024





కావలిలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



బస్సులు, ప్రయాణికులు లేక నిర్మానుష్యంగా ఉన్న నెల్లూరు ప్రధాన బస్టాండు

జనఘోష

- బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షణ
- ప్రైవేటు వాహనాలే దిక్కు
- నిర్మానుష్యంగా పోలీస్‌స్టేషన్లు
- గోడు వినే దిక్కులేక వెనుతిరిగిన ఫిర్యాదుదారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా మేదరమిట్ల 'సిద్ధం' సభ 24 గంటల ముందే జిల్లా ప్రజలకు నరకం ఏమిటో చూపించింది. ఉన్న బస్సులన్నీ సిద్ధం సభకు తరలివెళ్లడంతో ప్రయాణికులు అల్లాడిపోయారు. జిల్లావ్యాప్తంగా అన్ని బస్టాండ్లు, ముఖ్య కూడళ్ల వద్ద బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాచారు. ఎంతకూ బస్సులు రాకపోవడంతో కాలినడకన కొందరు, ఆటోలు ఎక్కి ఇంకొందరు స్వగ్రామాలకు వెళ్లారు. మరి కొందరు ప్రయాణాలను వాయిదా వేసుకొని ఇంటికి తిరుగుముఖం పట్టారు. ఇక ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయడానికి, రాసిన తరువాత ఇళ్లకు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండులో ప్రయాణికులు గంటల తరబడి ఎదురుచూసినా బస్సులు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయించారు. ఒక్కో ఆటోలు పది మందికి తక్కువ లేకుండా ప్రయాణించారు. కావలిలో పరిస్థితి మరీ దారుణం. వందల సంఖ్యలో ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాశారు. ఆత్మకూరు, ఉదయగిరి ఇలా ఒక ప్రాంతమని కాకుండా జిల్లావ్యాప్తంగా పట్టణాలు మొదలు పల్లెల వరకు బస్టాండ్లు, కూడళ్ల వద్ద ప్రయా ణికుల ఘోష కనిపించింది. ఇక పోలీస్ స్టేషన్ల పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు.

బోసిపోయిన స్టేషన్లు

పోలీసులు, ఫిర్యాదుదారులతో సందడిగా ఉండే పోలీస్ స్టేషన్లు మనుషులే లేక మౌన గంభీర ముద్ర దాల్చాయి. నెల్లూరులోని ఒక స్టేషన్ పరిధిలో దాడిలో గాయపడిన బాధితుని ఫిర్యాదు తీసుకునే దిక్కు కూడా లేదు. దీంతో పోలీసు ఫిర్యాదు ఆధారంగా ఆసుపత్రిలో చికిత్స చేసుకోవా ల్సిన బాధితుడు కేసును వదిలేసి ప్రైవేటు ఆసుపత్రిలో కట్టు కట్టించుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లు ఒకరిద్దరు కానిస్టేబుళ్లకు పరిమితం అయ్యాయి. దీంతో తమ గోడు వెళ్లబోసు కోవడానికి వచ్చిన ఫిర్యాదు దారులు నిరాశ నిస్పృహలతో వెనుతిరిగారు. సిద్ధం సభకు ఆర్టీసీ బస్సు లు, పోలీసులు తరలి వెళ్లడంతో జిల్లా వాసులు పడ్డ అవ స్థలు అన్నీ ఇన్నీ కావు.

అంతా నిర్మానుష్యం

మేదరమెట్ల 'సిద్ధం' సభ బందోబస్తుకు సీఐ, ఎస్‌ఐ, పెద్ద సంఖ్యలో పోలీసులు తరలివెళ్లడంతో శనివారం కోవూరు పోలీస్‌స్టేషన్ నిర్మానుష్యంగా మారింది. ఎస్‌ఐ, సీఐ ఉంటే తమ సమస్యల పరిష్కారం కోసం సాయంత్రం పూట పెద్దసంఖ్యలో బాధితులు వచ్చేవారు. అయితే, అంతా మేదరమెట్లకు తరలివెళ్లడంతో కోవూరు సర్కిల్ పరిధిలో రెండు రోజులు ఎలాంటి పోలీసు సహాయం అందే అవకాశం కనిపించడం లేదు.

- కోవూరు



నెల్లూరు : ఆత్మకూరు బస్టాండులో పడిగాపులు



'సిద్ధం సభకు రండి!

- వలంటీర్ల ప్రచారం

సీఎం సభకు రావాలంటూ వలంటీర్లు ప్రచారం చేస్తున్నారు. నరుకూరు సచివాలయ కన్వీనర్ తలమంచి సురేంద్రబాబుతో కలిసి వలంటీర్లు ఆకుల నవీన్, నెల్లూరు వినయ్, సాదా సోము, వినోద్, మునగాల రవి, షేక్ ఖాదర్ మోహిద్దీన్ ప్రచారం చేయడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక ప్రతి గడపకు వెళ్లి వైసీపీ పథకాలను వివరించి, మీరు ఓటు వేయాలని లేని పక్షంలో సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని వలంటీర్లు బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారంటూ ప్రతిపక్ష పార్టీలు నాయకులు, ప్రజలు విమర్శిస్తున్నారు.

- తోటపల్లి గూడూరు



నరుకూరులో ప్రచారం చేస్తున్న వలంటీర్లు

మౌఖిక ఆదేశాలతో పంపలేం

- కావలిలో అద్దె బస్సుల యజమానులు

కావలి : సీఎం జగన్ 'సిద్ధం' సభకు బస్సులు పంపే విషయంలో ఆర్టీసీ అధికారులు, అద్దె బస్సుల యజమానుల మధ్య ఏకాభిప్రాయం కుదర లేదు. కావలి డిపో నుంచి 60 బస్సులు కేటాయించాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలిచ్చారు. అయితే డిపోలో 50 బస్సులు ఉండగా, వాటిల్లో 47 మాత్రమే కండిషన్‌లో ఉన్నాయి. మరో 34 అద్దె బస్సులు నడుస్తున్నాయి. దీంతో సీఎం సభకు అద్దె బస్సులు కూడా పంపక తప్పదు. అయితే, లిఖిత పూర్వక ఆదేశాలు లేకుండు సీఎం సభకు బస్సులు పంపేందుకు యజమానులు వెనుకంజ వేస్తున్నారు. ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లాలి? ఎప్పుడు రావాలి? తదితర వివరాలు లేకుండా ఒక మాట చెప్పి పొమ్మంటే తర్వాత పేమెంట్ ఎవరు చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. అంతేగాక తమ బస్సులు తిరిగే ప్రాంతాలకే పర్మిట్లు ఉంటాయని, సీఎం సభకు వెళ్లి ఏదైనా ప్రమాదం జరిగితే దానికి తామే బాధ్యత వహించాల్సి వస్తుందని వారు యజమానులు వాపోతున్నారు. మొత్తమ్మీద లిఖిత పూర్వక ఉత్తర్వులు ఇచ్చి బస్సులను తీసుకువెళతారా? లేదా బెదిరింపులతో తీసుకు వెళతారా! అనేది చర్చనీయాంశమైంది.



బుచ్చిరెడ్డిపాళెం : శనివారం రాత్రి బస్టాండు సెంటర్‌లో నిరీక్షణ



కందుకూరులో వెలవెలబోతున్న ఆర్టీసీ బస్టాండ్



కావలి డిపోలో నిలిచిపోయిన ఆర్టీసీ అద్దె బస్సులు



నిర్మానుష్యంగా అల్లూరు పోలీస్‌స్టేషన్



కందుకూరు : పోలీస్ స్టేషన్‌లో సెంట్రీ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారికి రెండురోజుల తర్వాత రావాలని చెప్పి పంపేస్తున్నారు.



నెల్లూరు : ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద పోలీసులేరీ!?

కష్టంగా కాదు.. ఇష్టంతో చదవండి!

- విద్యార్థులతో హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

బిట్రగుంట, మార్చి 9 : విద్యను అభ్యసించేటప్పుడు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే దాని సారంశం స్పష్టంగా అర్థమవుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు అన్నారు. బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. అంతకముందు బిలకూటక్షేత్రంలో ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మన్మథరావు దర్శనం చేసుకున్నారు. ఆయను ఈవో రాధాకృష్ణ, పాలక మండలి చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. సరస్వతీ నమస్తుభ్యం మండల కమిటీ చైర్మన్ మద్దులూరి ప్రసాద్‌రావు, జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం కనకారావుల ఆహ్వానం మేరకు న్యాయమూర్తి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ద్దేశించి మన్మథరావు మాట్లాడుతూ శ్రద్ధతో చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట న్యాయాధికారులు, న్యాయవాదులు, ఎంఈవో జయమ్మ, విశ్రాంత ఇంజనీరు గోపికృష్ణ, కావలి సీఐ రాజేష్ తదితరులు ఉన్నారు.



జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

బండ భారం తగ్గింది!

- రూ.100 తగ్గిన గృహావసరాల సిలిండర్
- సామాన్యుడికి ఊరటనిచ్చిన కేంద్రం



నెల్లూరు (హరనాథపురం)/చేజర్ల, మార్చి 9 : గ్యాస్ వినియోగదారులకు ఓ శుభవార్త. సిలిండర్ ధరను రూ.100 తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శనివారం నుంచి ఈ ధర అమలులోకి వచ్చింది. ప్రస్తుతం రూ.14.2 కిలోల సిలిండర్ ధర ప్రస్తుతం రూ.940 ఉండగా ధర తగ్గింపుతో 840కి చేరింది. రెండు, మూడేళ్లుగా అమాంతం పెరిగిన ధర గత ఏడాది మార్చి నెలలో రూ.1150లకు చేరింది. అయితే, గత ఏడాది ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సిలిండర్ ధరను రూ.200లకు తగ్గించారు. కాగా, 10 కిలోల సిలిండర్ ధర రూ.679.50 నుంచి రూ.609 లకు, 5 కిలోల సిలిండర్ ధర రూ.352 నుంచి 315.50 లకు తగ్గింది. దేశీయ ఇంధన ధరకు ప్రామాణికంగా భావించే అంతర్జాతీయ చమురు, గ్యాస్ ధరలు స్వల్పంగా కిందకు దిగొచ్చిన కారణంగానే ఎల్‌పీజీ ధర తగ్గించినట్లు తెలుస్తోంది. ధర తగ్గింపు నిర్ణయం నారీమణులకు లబ్ధి చేకూరు తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, జిల్లాలో 8.06 లక్షల విని యోగ దారులు ఉండగా, రూ.100 తగ్గింపుతో అందరికీ ఊరట లభించినట్లు అయ్యింది.

జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు	49
డొమెస్టిక్ కనెక్షన్లు	4,64,871
దీపం	2,67,421
ఉజ్వల	18,986
సీఎస్సార్	33,589
కమర్షియల్	2,616
మొత్తం కనెక్షన్లు	7,87,483

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

- రాష్ట్రంలో అప్పుల భారమే అభివృద్ధి
- బలమైన శక్తిగా బీజేపీని నిలుపుదాం
- పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు
- బూత్‌స్థాయి కార్యకర్తలకు దిశానిర్దేశం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మార్చి 9 : రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏదైనా అభివృద్ధి చెందింది అంటే అది అప్పుల భారం మాత్రమేనని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపేం దుకు అందరూ కలిసికట్టుగా రావా లని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి పిలుపు నిచ్చారు. శనివారం నగరంలోని కస్తూర్బా గార్డెన్స్‌లో బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథు లుగా మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహా న్, పురందేశ్వరి పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ గడిచిన ఈ ఐదేళ్లలో రూ.3.5 లక్షల కోట్ల అప్పు ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని నేడు రూ.12 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై వేసింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. మన పాలన ప్రారంభమయ్యే పవిత్రమైన సెక్రటేరియట్‌ను రూ.350 కోట్లకు తనఖా పెట్టి అప్పు తీసుకోవడాన్ని ఆంధ్రులు క్షమించగలరా!? అని నిలదీశారు. రాష్ట్ర సంపద అయిన గనులను తాకట్టు పెట్టి రూ.7వేల కోట్లు తీసుకువచ్చారని, ఇలా రాష్ట్రంలో ఏది కన్పిస్తే అది తాకట్టు పెట్టి డబ్బులు తీసుకు వస్తున్న జగన్మోహన్‌రెడ్డి తన జేబు నింపుకొని, తన అస్మదీయుల జేబులు నింపుతున్నారని మండిపడ్డారు. ఇవాళ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందంటే ఎంత బాధా కరమో ప్రజలు ఆలోచించాలన్నారు. ఈ పాలన యథావిధంగా కొనసాగితే రేపు మన బిడ్డలకు, వారి భావితరాలకు భవిష్యత్తు ఉండదనే విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. అందరం నడుం బిగించి వైసీపీ ప్రభుత్వాన్ని ఏవిధంగా గద్దె దించాలన్న దానిపై దృష్టి సారించాలన్నారు. ప్రతి కార్యకర్త నడుం బిగించి బీజేపీని బలమైన శక్తిగా ఎదిగేల కృషి చేయా ల్సిన బాధ్యత ఉందన్నారు. కాగా, వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కమలదళంలో చేరారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర ఎన్నికల పరిశీలికుడు శేఖర్‌జీ, జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మోర్చాల ఇన్‌చార్జ్ పి సురేంద్రరెడ్డి, బీజేపీ నాయకులు వాకాటి నారాయణరెడ్డి, సీపా వంశీధర్ రెడ్డి, గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శివరాజ్ సింగ్ చౌహాన్, పురందేశ్వరిలను గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు



భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరుడికి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కల్యాణం కమనీయం!

వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలు, అశేష భక్తజనం నడుమ నెల్లూరులో ఆదిదంపతుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, రుద్రహోమాలు జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారం, పూలంగిసేవలు జరిగాయి. సాయంత్రం భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరుడి కల్యాణం వైభవంగా జరిగింది. ఎదురుకోలు ఉత్సవం అనంతరం గజవాహనంపై ఆదిదంపతులు విహరించారు. ఆలయ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ఈవో వేణుగోపాల్, ధర్మకర్తలు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)



జాతీయ రహదారిని అనుకొని ముస్తాబైన లేఅవుట్

వరికుంటపాడులో
రియల్టర్ల ఇష్టారాజ్యం

- నిబంధనలకు తూట్లు ● యథేచ్ఛగా లేఅవుట్ల ఏర్పాటు
- కొందరు ఉద్యోగులదీ అదేబాట ● పట్టించుకోని అధికారులు

వరికుంటపాడు, మార్చి 9 : రియల్టర్లు నిబంధనలకు తూట్లు పొడుస్తూ తమ అక్రమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారపార్టీ నాయకుల అండదండలతో కనీసం పంచాయతీ అనుమతి కూడా పొందడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో తేటతెల్ల మవుతోంది. నాయకుల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇదే మిటని ఎవరైనా ప్రశ్నిస్తే వ్యాపారులకు వత్తాసుగా అనుమతులు ఉన్నాయంటూ బుకాయి స్తుండడం గమనార్హం. ఇటీవల జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలో ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతుంది. మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, కందుకూరు తదితర పట్టణాలకు సమీపంలోని గ్రామాల్లో వీటి ప్రభావం మరింత అధికంగా ఉంది. కొంతమంది వ్యాపారులు రాత్రికి రాత్రే లేఅవుట్లు వేసి జోరుగానే అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ తరుణంలో వ్యాపారులు, మధ్యవర్తులను నమ్మిన ప్రజలు రూ. లక్షలు పెట్టి ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి తదితర ప్రాంతాల్లో ఇటీవల అధికశాతం అక్రమ లేఅవుట్లు వెలశాయి.

ఉద్యోగులదీ అదే బాట

వ్యాపారులకు తోడు మండలంలోని కీలక శాఖలో విధులు నిర్వర్తించే ఉద్యోగుల హవా రియల్ వ్యాపారంలో మరింతగా పెరుగుతోంది. ఆ శాఖలోని ఓ అధికారి అడుగుజాడల్లో నడుస్తున్న ఉద్యోగులు సైతం తమను అడిగే వేరు లేరులే అనుకున్నారో, లేక వేతనాలకు తోడు అదనపు ఆదాయం వస్తుందని ఆశ పడ్డారో ఏమోగానీ ప్రతినిత్యం వ్యాపార లావాదేవీల్లోనే కాలం గడుపుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆ శాఖ పనితీరు కూడా అంతంతమాత్రంగానే ఉందని చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమ లేఅవు ట్లకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇదంతా ఓ ఎత్తు అయితే నెల్లూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దు మండలమైన వరికుంట పాడులో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇప్పటికే మండలం మీదుగా 565 జాతీయ రహదారి ఉండగా, నూతనంగా 167బీ జాతీయ రహదారి మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయి. వీటిని ఆశగా చూపిన వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నా యి. ఈ నేపథ్యంలో మండలంలోని విరువూరు, వేంపాడు, రామాపురం, వరికుంటపాడు పంచాయతీల్లో రోజుకోచోట అక్రమ లేఅవుట్లు ముస్తాబవుతున్నాయి.

టార్పాలిన్ పట్టలేవి జగనన్నా..?

- ఐదేళ్లుగా సరఫరా నిల్ ● రైతులపై అదనపు భారం

తమది రైతు ప్రభుత్వమని, రైతుల సంక్షేమమే లక్ష్యమంటూ గొప్పలు చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం పంట చేతికొచ్చే సమయానికి మారుతోన్న వాతావరణ పరిస్థితుల్లో ఆరుగాలం కష్టించి పండించిన ఉత్పత్తులను కాపాడుకొనేందుకు అవసరమైన టార్పాలిన్ పట్టల పంపిణీకి మాత్రం మంగళం పాడింది. గత టీడీపీ ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్ పట్టలను అందించడంతో రైతులకు అవస్థలు తప్పేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటి పంపిణీ ఊసే మరిచింది. దీంతో తప్పని పరిస్థితుల్లో రైతులపై అదనపు భారం పడుతోంది. దాదాపు ఐదేళ్లుగా కనీసం ఒక్కటంటే ఒక్క పట్ట కూడా పంపిణీ చేసిన దాఖలాలు లేవు. దీంతో రైతులు పట్టలేవి జగనన్నా.. అంటూ ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తున్నారు.

- నెల్లూరు(వ్యవసాయం)



పంట కోత నూర్పిడి అనంతరం ఆరబెట్టిన ధాన్యం 17 శాతం తేమ వస్తేనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటుంది. పొలంలో కోత పూర్తయిన తరువాత ధాన్యం ఆరబెట్టాలంటే అనువుగా ఉండే ప్రదేశాలు కూడా లేవు. దీంతో తప్పని పరిస్థితుల్లో జాతీయ, రాష్ట్ర, స్థానిక రోడ్లపైనే ధాన్యం ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి. దాదాపు వారం నుంచి 10 రోజుల పాటు ఎండకు ఆరబెట్టుకోవాలి. అదికూడా ఎండ ఎక్కువగా ఉంటేనే తేమశాతం వస్తోంది. అదే సమయంలో అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోతోంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే టార్పాలిన్ పట్టలు ఎంతో ముఖ్యం. ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్ పట్టలు కొనాలంటే మార్కెట్‌లో దాదాపు రూ.1700 నుంచి రూ.4500 వరకు అందుబాటులో ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో సీజన్ ప్రారంభంలోనే అవసరమైన పట్టలకు ఇండెంట్ పెట్టడంతో సకాలంలో రైతులకు 50 శాతం రాయితీపై టార్పాలిన్ పట్టలను అందించేది. అయితే ప్రస్తుతం రైతులు టార్పాలిన్ పట్టలు కావాలని వ్యవసాయశాఖ అధికారులను కోరుతున్నప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు.

● అదనపు భారం

సాగు ఖర్చులు పెరిగిపోతున్న నేపథ్యంలో చేతికందిన పంటను కాపాడుకునేందుకు రైతులపై అదనపు భారం పడుతోంది. కొత్తవి కొనుగోలు చేయలేక అద్దెకు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కో పట్ట సుమారు రూ.50 చొప్పున అద్దెకు తెచ్చుకుంటున్నామని 10 రోజులకు రూ.500 చెల్లిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా ధాన్యం ఆరబెట్టుకునేందుకు కనీసం 8 పట్టలైనా అవసరమవుతాయని, దీంతో దాదాపు రూ.4వేలు ఈ పట్టలకే ఖర్చవుతోందని చెబుతున్నారు. కొంత మంది రైతులు పెట్టుబడి లేక పొలాల్లోనే ధాన్యం వచ్చిన కాడికి దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అప్పటికప్పుడే డబ్బులు ఇవ్వడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం



టార్పాలిన్ పట్టలు కావాలని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను కోరుతున్నారు. దీనికి సంబం దించిన నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే జిల్లాకు కేటాయింపులు జరిగే అవకాశం ఉంది.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి



ఆశాజనకంగా పచ్చిమిర్చి ధర

అనంతసాగరం, మార్చి 9: గతేడాదితో పోల్చుకొంటే ప్రస్తుత సీజన్‌లో పచ్చిమిరపకు ఆశాజనకపు ధర లభిస్తోందని సాగుదారులు హర్షం వ్యక్తమవుతోంది. మండలంలోని బొమ్మవరం, అగ్రహారం, గోగులపల్లి, చాపురాళ్లపల్లి, యాకర్లపాడు, గౌరవరం, సంజీవనగరం గ్రామాల్లో బోర్ల కింద విస్తారంగా ఈ ఏడాది మిరప సాగుచేశారు. గతేడాది మార్చిలో (మనుము 11 కేజీల 200 గ్రాములు) రూ.180 నుంచి రూ.200 వరకు ధర ఉండగా ప్రస్తుతం రూ.240 ధర లభిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు
25,076 మంది హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 9 : జిల్లాలో జరుగుతున్న ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ప్రథమ సంవత్సరం జనరల్ మ్యాథ్స్-1బీ, జువాలజీ-1, హిస్టరీ-1తో పాటు ఒకేషనల్ పరీక్షలకు 25,076 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 81 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు జనరల్ విద్యార్థులు 24,443 మందికి 23,935 మంది హాజరు కాగా 508 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,322 మందికి 1,141 మంది హాజరు కాగా 191 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 25,775 మందికి 25,076 మంది హాజరు కాగా 699 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు నాలుగు సెంటర్లు, డీవీఈవో మధుబాబు 3 సెంటర్లు, డీఈసీ సభ్యులు, స్క్వాడ్ 30 సెంటర్లతో 37 కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

● మూల్యాంకనం ప్రారంభం

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం శనివారం నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వస్తున్న జవాబు పత్రాలను రిసీవ్ చేసుకుని కట్టుదిట్టమైన బందోబస్తు నడుమ మూల్యాంకనాన్ని ప్రారంభించినట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాకు 33 వేల సంస్కృతం జవాబు పత్రాలు వచ్చాయని, తెలుగు, హిందీ జవాబు పత్రాలు వస్తున్నాయన్నారు. తొలిరోజున 56 మంది అధ్యాపకులతో మూల్యాంకనం చేపట్టామని, ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం చేస్తున్నామన్నారు. పరీక్షలు పూర్తయిన తరువాత ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

'జిలకర్ల' దిగుబడి అదరహో..!


- ఎకరానికి నాలుగన్నర పుట్ల పైనే.. ● పొలంవద్దే రైతుకు సన్మానం



సాగుచేసిన వరిపైరు వద్ద రైతు వాసిపల్లి పద్మనాభరెడ్డి

జలదంకి, మార్చి9: సాధారణంగా జిలకర మసూరి (బీపీటీ -5204) రకం వరి ఎకరానికి బాగా పండితే రెండన్నర పుట్ల ధాన్యం కంటే ఎక్కువ దిగుబడి రాదు. కానీ జలదంకి మండలం క్రిష్టాపాడుకు చెందిన రైతు వాసిపల్లి పద్మనాభరెడ్డి తన రెండెకరాల పొలంలో నాటిన బీపీటీ -5204 రకం ఎకరాకు 75కిలోల బస్తాలు 55కి మించి దిగుబడి వచ్చేలా ఉందని వింజమూరు ఏడీఏ రామిరెడ్డి పొలంలోకి వెళ్లి పరిశీలించి అంచనాకు వచ్చారు. దీంతో ఆయన శనివారం ఆదర్శరైతులను క్షేత్ర ప్రదర్శన చేయించారు. జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, ఆత్మ పీడీ దొరసానమ్మలు కూడా వరిపైరును పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఆ రైతు అనుభవాలను వారికి వివరించారు. అనంతరం పద్మనాభరెడ్డిని వారు సన్మానించారు. క్షేత్రసందర్శనలో డీపీడీ శివనారాయణ, ఏఈవో మునెమ్మ, కావలి మాజీ ఏఎంసీ చైర్మన్ ఎంవీ రామిరెడ్డి, వేములపాడు సర్పంచు బీవీ క్రిష్టారెడ్డి, వింజమూరు సబ్‌డివిజన్‌లోని పలువురు ఆదర్శరైతులు పాల్గొన్నారు.

వెండినందిపై
ఆదిదంపతుల వైభోగం



జొన్నవాడలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చిన స్వామి అమ్మవార్లు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 9: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లింగోద్భవకాల పూజలు అనంతరం శనివారం వేకువ జాము 4 గంటల నుంచి ఉదయం 7గంటలు వరకు గ్రామోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. శ్రీశైలం రాజగోపాల్, సోదరుల కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

137 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పర్మినెంట్



డీఎంహెచ్‌వో నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న ఉద్యోగులు


నెల్లూరు(వైద్యం), మార్చి 9 : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 137 మంది కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేసింది. ఆ ఉత్తర్వులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య శనివారం జారీ చేశారు. వీరిలో ఎంపీహెచ్ఏలు, ల్యాబ్ టెక్నీషియన్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు డీఎంహెచ్‌వోకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 9: బాత్‌రూమ్‌లో ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. వింజమూరు మండలం తమ్మిడిపాడుకు చెందిన ఎం.వేమయ్య, పెద్ద సుబ్బమ్మ(75)లు దంపతులు. వీరి కుమారుడు నారాయణ నగరంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటూ ఆటో నడుపుకుటూ జీవనం సాగిస్తున్నారు. వేమయ్య దంపతుల వద్ద నగరంలోని ఎన్‌టీఆర్ నగర్ సమీపంలోని సరస్వతి నగర్‌లో నివాసం ఉంటున్న రాజమ్మ కొంత డబ్బు అప్పు తీసుకుంది. ఆ బాకీ కోసం వారు పదిహేను రోజుల కిందట రాజమ్మ ఇంటికి వచ్చారు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నారు. మూడు రోజుల కిందట వేమయ్య పింఛన్ డబ్బులు కోసం తన స్వగ్రామానికి వెళ్లారు. ఈ క్రమంలో శివరాత్రి కావడంతో రాజమ్మ గుడికి వెళ్లింది. ఆమె భర్త శ్రీనివాసులు అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉన్నారు. రాజమ్మ గుడి నుంచి ఇంటికి వచ్చి చూడగా సుబ్బమ్మ కన్పించలేదు. ఇళ్లంతా గాలించిగా బాత్‌రూమ్ తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా లోపల గడియపెట్టి ఉంది. స్థానికుల సహాయంతో బాత్‌రూమ్ గడియ పగులగొట్టి చూడగా సుబ్బమ్మ లోపల మృతి చెంది ఉంది. ఈ విషయాన్ని రాజమ్మ మృతురాలి కుమారుడు నారాయణకు తెలియజేశారు. ఆయన సంఘటన స్థలానికి చేరుకుని శుక్రవారం అర్ధరాత్రి బాలాజీ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. శనివారం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు సీసీఎస్ ఎస్ఐ డేవిడ్‌దాస్ మృతి

- పోలీసు అధికారుల సంఘం సంతాపం



డేడిడ్‌దాస్(ఫైల్)

నెల్లూరు(క్రైం), మార్చి 9: విధి నిర్వహణలో గుంటూరు సీసీఎస్ ఎస్ఐ డేవిడ్‌దాస్ మృతి చెందాడు. ఆయన మృతికి ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి, జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు శనివారం సంతాపం తెలిపారు. డేవిడ్‌దాస్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరు గాంధీనగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆయన 1989లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి హెచ్‌సీ, ఏఎస్ఐగా నెల్లూరులో విధులు నిర్వహించారు. డీసీఆర్‌బీ ఎస్ఐగా పనిచేస్తూ ఇటీవల గుంటూరు సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం రాత్రి కోటప్పకొండ బందోబస్తులో అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం గూడూరులో జరుగుతాయని శ్రీహరి తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో
12 మందికి గాయాలు

కావలి : సంకలవారితోట ఇందూరువారివీధిలో గత నాలుగైదు రోజులుగా పిచ్చి కుక్క కరిచి 12 మంది గాయపడ్డారు. స్థానికులు ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవటం లేదన్నారు. మున్సిపల్ అధికారు లు స్పందించి ఆ కుక్కను అక్కడ నుంచి తరలించాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6283
వెండి కిలో ధర	రూ. 74,900
వెండి ఒక గ్రాము	రూ. 76.90

11, 12వ తేదీల్లో
రంజాన్ మాసం ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 9 : ముస్లింలకు సకల శుభాలు చేకూర్చే పవిత్ర రంజాన్ మాసం ఈ నెల 11, 12వ తేదీలలో ప్రారంభం కానుంది. ఈ మాసంలో పవిత్ర మనస్సుతో కఠిన నియమాలతో ఉపవాస దీక్షలు చేసి భగవంతుడి విశ్వాసం పొందాలని ముస్లిం కుటుంబాలు భావిస్తారు. రంజాన్ మాసం రజబ్ షాబాన్ మాసాల్లో నెలవంకను దైవ ప్రవక్త మహ్మద్‌ను ప్రార్థిస్తారు. ఈ మేరకు జిల్లాలోని ముస్లింలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ మాసంలో అల్లాహ్‌ను విశ్వసిస్తూ చేసే రంజాన్ ఉపవాసాలకు ఆయన తగిన పుణ్యఫలాలు ఇస్తారని ప్రతి ఒక్కరూ విశ్వసిస్తారు. ఈ మాసంలో ఏదైనా దైవాన్ని నమ్మి సత్కారం చేస్తే దానికి ఫలితంగా 70 సత్కారాలు చేసిన పుణ్యఫలాలు లభిస్తాయని వారి విశ్వాసం. అల్లాహ్ ప్రీతి కోసం ముస్లింలు, దేవుడు ఒక్కడే అని నమ్మడం, క్షమాపణ కోరడం, స్వర్గ ప్రవేశం కల్పించమని కోరడం, నరకం నుంచి విముక్తిని ప్రసాదించమని, దివ్య ఖురాన్‌ను ఎక్కువ సార్లు పారాయణం చేయడం వంటి ఐదు పనులను చేస్తారు. ఈ పుణ్యమాసంలో ధనిక, పేద అనే తేడా లేకుండా సర్వ మానవ సమానత్వంను కోరుకుంటారు. రాత్రివేళల్లో తహజ్జుద్ నమాజ్‌లు, జకాత్, ఫిత్రాదానాలు, తాక్‌రత్నలు (బేసిరాతులు) ఏతాకాఫ్ (తపోనిష్ఠ) దు అ (వేడుకోలు) లాంటి ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యతలు ఇస్తారు. షర్ఫ్, సున్నత్, నఫీల్‌లతో కలిసి ప్రతీరోజు 5 సార్లు నమాజులు చేస్తారు. సహరీతో ఉపవాసం ప్రారంభించి ఇఫ్తార్‌తో దీక్షలు విరమిస్తారు. ఇలా 30రోజులు చిత్తశుద్ధితో పాటించి అల్లాహ్ కృతజ్ఞతలు తెలుపుకునేందుకు సంతోషంగా రంజాన్ పండుగను ఏప్రిల్ 11న జరుపుకుంటారు.

ఏర్పాట్లను మరచిన నేతలు, అధికారులు

పవిత్ర మాసం రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభానికి 2రోజులే ఉన్నాయి. ఇంత వరకు నగరంలో మసీదుల వద్ద రంజాన్ ఏర్పాట్లు ఊసేలేదు. రంజాన్ మాసం ప్రారంభమవుతుందంటే ప్రజాప్రతినిధులు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షలు నిర్వహించి తగిన ఏర్పాట్లు చేయడం ఆనవాయితీ. కానీ ఇంతవరకు జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు రంజాన్ ఏర్పాట్లపై దృష్టి సారించకపోవడంతో ముస్లింలు ఆవేదన చెందుతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదుల్లో చిన్నచిన్న మరమ్మతుల కోసం 30 రోజులు ముందే నిధులు విడుదల చేసేవి. ఈ ఏడాది మరమ్మతులకు నిధుల విడుదల జాడలేకపోవడంతో కొన్ని మసీదులలో స్థానిక కమిటీలే ఆ పనులు చేయించుకున్నారు.

కనుల పండువగా నృసింహుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

డక్కిలి(రాపూరు), మార్చి 9: స్థానిక పెంచలకోన చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నరసింహ స్వామికి శనివారం వేదపండితుల మంత్రోచ్చరణలతో కల్యాణం నిర్వహించారు. ఉదయం ప్రత్యే కంగా అలంకరించి అభిషేకాలు చేశారు. సాయంత్రం మంగళ వాయిద్యాల మధ్య సహస్ర దీపా లంకరణ సేవ చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో సాగర్‌బాబు తగిన ఏర్పాట్లు చేశారు.

12న ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

- జువ్వలదిన్నెలో అధికారుల పరిశీలన



ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ, ఇండస్ట్రీయల్ అధికారులు తదితరులు

బిట్రగుంట, మార్చి 9: బోగోలు మండలం జువ్వలదిన్నె లో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ ప్రాంతాన్ని శనివారం రాష్ట్ర ఇండస్ట్రీయల్ అధికారి యువరాజ్, జేసీ సేతుమాధవన్‌లు పరిశీలించారు. ఈనెల 12న ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇండస్ట్రీయల్ అధికారుల రాకతో మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు పరుగులు తీశారు. తహసీల్దారు లేకపోవడంతో ఆర్ఐ వాజీద్, వీఆర్వో కిరణ్‌కుమార్‌లు రికార్డులతో అధికారులను అనుసరించారు. వారు ముందుగా బోగోలు ఎంపీడీవో కార్యాలయానికి వస్తారని సమాచారం అందడంతో కొంతమంది మండల నాయకులు వేచిచూశారు. అయితే దగదర్తి మండలానికి వెళ్లినట్లు తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. అసంపూర్ణంగా ఉన్న ఫిషింగ్ హార్బర్‌ను వచ్చే మంగళవారం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండటం చర్చనీయాంశమైంది.

మహిళా సాధికారతకు కృషి

- మాజీ మంత్రి సోమిరెడ్డి

నెల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే మహిళా సాధికారతకు కృషి చేస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మహిళా సాధికారత కోసం మహిళా దినోత్సవం రోజున ఇరు పార్టీలు 'కలలకు రెక్కలు' అనే కొత్త పథకాన్ని ప్రక టించినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ కూడా పేదరికంతో చదువుకు దూరం కాకూడదన్న ఆలో చనలో 'కలలకు రెక్కలు' అనే కొత్త పథకాన్ని రూపొం దించినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థినులు ఉన్నత విద్య కోసం ఇబ్బంది పడకుండా రుణ సదుపాయం కల్పించేందుకు టీడీపీ-జనసేన నిర్ణయం తీసుకున్నాయని పేర్కొన్నారు. ఈ రుణాలకు సంబంధించిన వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. తద్వారా ఆడబిడ్డలకు ఉన్నత విద్య దగ్గరవుతుం దని పేర్కొన్నారు.

బిట్రగుంట-చెన్నై ఫాస్ట్ మెమూ రైలు పునరుద్ధరించాలి

నెల్లూరు (విద్య) : నెల్లూరు నుంచి గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలకు నిత్యం ప్రయాణం చేసే ఉద్యోగులకు, అనారోగ్యంతో ఉన్నవారు చెన్నైకు వెళ్లేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న బిట్రగుంట-చెన్నై ఫాస్ట్ మెమూ రైలును పునరుద్ధరించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు శనివారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వినతి పత్రం అందచేశారు. గత కొంతకాలంగా ఈ రైలును నిలుపుదల చేయడంతో ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వెంకయ్య అధికారులతో మాట్లాడతానని తెలిపినట్లు నేతలు తెలిపారు.

రేపు జాతీయ అప్రెంటీస్ మేళా

నెల్లూరు(విద్య), మార్చి 9 : భారత నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఈనెల 11న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో భార్గవి ఆటోమొబైల్స్, ఏపీఎస్ఆర్‌టీసీ, సీకాఫ్, గ్రీన్‌టెక్, ఎలక్ట్రోస్టీల్ కంపెనీలు, ఏపీపీడీసీఎల్, క్యాడ్‌బరీ, మ్రాడ్రస్ బిల్డర్స్, గోల్డ్‌ఫీల్డ్, శరత్ ఇండస్ట్రీస్, కార్గిల్ ఇండియా తదితర సంస్థలు పాల్గొంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో సంబంధిత తేదీలలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

తగ్గిన శనగ దిగుబడి

- వర్షాభావ పరిస్థితులే కారణమంటున్న రైతులు
- ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు మించలేదు
- పెట్టుబడులు చేతికందని వైనం ● ఆందోళనలో అన్నదాత



దుత్తలూరులో ఆరబెట్టిన శనగలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 9: ఈ ఏడాది శనగ పంటల కోతలు ప్రారంభమయ్యాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సకాలంలో వానలు కురవకపోవడంతో దిగుబడి బాగా తగ్గింది. అరకొరగా వచ్చిన పంటను నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడంతో దళారులకు అమ్ముకునేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. గతేడాదితో పోలిస్తే ధర కాస్త మెరుగ్గా ఉన్నా దిగుబడి బాగా పడిపోయింది. చాలా మండలాల్లో 3 నుంచి 4 క్వింటాళ్లలోపు మాత్రమే దిగుబడి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. గతేడాది క్వింటం రూ.4,500లు పలికితే ఈ ఏడాది క్వింటం ధర రూ.6,200లు పలుకుతుంది. గతేడాది ప్రభుత్వ మద్దతు రూ.5,335లతో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. ఈ ఏడాది మద్దతు ధర రూ.5,440లుగా నిర్ణయించారు. మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలోని దుత్తలూరు, వరికుంటపాడు, కలిగిరి, వింజమూరు, కొండాపురం, ఏఎస్‌పేట, కందుకూరు తదితర ప్రాంతాల్లో 14,858 ఎకరాల్లో శనగ పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు రికార్డులు చెబుతున్నాయి. దుత్తలూరు మండలంలో 938 ఎకరాల్లో ఈ పంట సాగు చేశారు. సాగుకు అదును దాటి ఆలస్యం కావడంతో పంట సాగు చేసినప్పటి నుంచి వర్షాలు కురవకపోవడంతో ప్రత్యామ్నాంగా పొగాకు సాగు చేపట్టారు. దీంతో శనగ సాగు విస్తీర్ణం తగ్గింది. ఎకరానికి వరుణుడు కరుణించి ఉంటే ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని అన్నదాత వాపోతున్నారు. ఎకరా పంట సాగుకు దుక్కులు, విత్తనాలు, మందులు, కోత కూలీలు కలిపి సుమారు రూ.20వేలు అవుతుందని, ప్రస్తుతం వచ్చిన దిగుబడి, పలుకుతున్న ధరలతో పెట్టుబడులు కూడా రాని దుస్థితి ఉందంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా సంగమేశ్వరుడి కల్యాణం



సంగం: హనుమంత వాహనంపై సీతారాముల గ్రామోత్సవం

సంగం, మార్చి 9: సంగమేశ్వరాలయంలో శనివారం తెల్లవారుజామున సంగమేశ్వరస్వామి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీకామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించి వేద పండితులు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోశ్చరణల మధ్య వేడుక చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కానుకలు అందజేశారు.

నందివాహనంపై గ్రామోత్సవం

కల్యాణం అనంతరం స్వామిఅమ్మవారిని నందివాహనంపై ఉంచి గజపూలమాలలతో అలంకరించి పొదలకూరు మండలం సూరాయపాళెం గ్రామం గ్రామోత్స వం చేపట్టారు. ఉత్సవాన్ని ఆదివారం సంగమేశ్వరాలయానికి చేర్చారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా వంగల్లు భీమేశ్వరాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు.



కల్యాణోత్సవంలో భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

వైభవంగా హనుమంతుడి గ్రామోత్సవం

వీరాంజనేయస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున హనుమంతుడి గ్రామోత్సం నిర్వహించారు. హనుమంతుని ఉత్సవ విగ్రహంపై సీతారాముల విగ్రహాలను ఉంచి గజపూలమాలలు, విద్యుత్‌దీపాలంకరణలో గ్రామోత్స వాన్ని అలంకరించారు. భక్తులు కర్పూరహారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ట్రాఫిక్ సమస్య జటిలం

- పార్శిల్ వాహనాలతో ఆటంకం
- తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఉదయగిరి పట్టణంలో ఎదురెదురుగా వాహనాలు రావడంతో నిలిచిన ట్రాఫిక్

ఉదయగిరి, మార్చి 8: పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. నియోజకవర్గకేంద్రం కావడంతో ప్రతిరోజూ సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, ఉదయగిరి మండలాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలు వివిధ కార్యాలయాల్లో పని నిమిత్తంతో పాటు వ్యాపార కార్యకలా పాలకు వస్తుంటారు. ప్రధాన రహదారి వెంట ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లతో పాటు పార్శిల్ వాహనాలు రోడ్డు పక్కనే నిలిపి సరుకులు దిగుమతి చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ప్రధానంగా మెయిన్ బజార్, మార్కెట్‌వీధి, గండిపాళెం రోడ్డు, బస్టాండ్ సెంటర్లలో ఈ ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందిగా ఎక్కువగా ఉంటుంది. వాహనాలతోపాటు తోపుడుబండ్లు, కూరగాయలు, సోడాబండ్లు రోడ్డు మార్జిన్‌లో నిలుపుతూ వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జామియా మసీదులో కాకర్ల ప్రత్యేక ప్రార్థనలు





మాజీ మంత్రి నారాయణను సన్మానిస్తున్న కాకర్ల, ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్

వింజమూరు, మార్చి 9: పట్టణంలోని వైశ్య బజారులోని జామియా మసీదులో శుక్రవారం రాత్రి ముస్లిం సోదరులతో కలిసి ఉదయగిరి టీడీపీ జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అల్లా ఆశీస్సులు ఎల్లవేళలా కాకర్ల సురేష్‌కు ఉండాలని ఇమామ్ సాబ్ ఆశీర్వదించారు. అనంతరం ముస్లింలను పరిచయం చేసుకున్నారు. వారికి అవసరమైన సదుపాయాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మాచర్ల శ్రీను కోరిక మేరకు ఇస్త్రీ షాపు వద్దకు వెళ్లి బట్టలను ఐరన్ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే రజకులను అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. తెలుగుదేశం హయాంలో ఇస్త్రీ పెట్టెను ఉచితంగా ఇచ్చారని దీని ద్వారా జీవనోపాధి పొందుతున్నట్లు శ్రీను తెలిపారు. అనంతరం సిద్దార్థనగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త జ్యోతి పెంచలరావును పార్టీ కార్యక్ర మాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. పాత బస్టాండ్ సెంటర్‌లో కాకర్ల అభిమానులకు అభివాదం తెలుపుతూ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, కాకర్ల వెంకట్, షేక్.ఖాజావలి, హజరత్‌నాయుడు ఉన్నారు.

మాజీ మంత్రిని కలిసిన కాకర్ల

ఉదయగిరి: మాజీ మంత్రి పొంగూరు నారాయణను శనివారం నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ కలిశారు. నెల్లూరులోని నారాయణ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పుష్పగుచ్ఛంతో సన్మానించారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

సిద్ధం సభా.. మజాకా !

వరికుంటపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సిబ్బంది కనిపించకపోవడంతో బోసిపోయింది. ఆ స్టేషన్‌లో ఎస్‌ఐతో పాటు 13మంది సిబ్బంది విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే ఆదివారం మేద రమెట్లలో జరిగే సిద్ధం సభకు ఎస్‌ఐతో సహా 11మంది సిబ్బందికి బందోబస్తు విధులు కేటాయించారు. దీంతో కేవలం ఇద్దరు మాత్రమే దిక్కుగా మారి విధులు నిర్వర్తిస్తున్నారు.



వరికుంటపాడు పోలీస్‌స్టేషన్

జనసేన, బీజేపీతో పొత్తు చారిత్రాత్మకం

ఉదయగిరి రూరల్, మార్చి 9: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన..బీజేపీలతో ఏర్పర్చుకొన్న పొత్తు చారిత్రాత్మకమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నిరంగాల్లో వెనుకబడిన రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగ యువత భవిష్యత్తు, సాగు, తాగునీటి కష్టాలు తీర్చడం కోసం ఈ పొత్తు కుదుర్చుకోవాల్సి వచ్చిందన్నారు. జగన్ సాగిస్తున్న అరాచక పాలనకు తెరదించడమే ఉమ్మడి లక్ష్యమన్నారు. మూడు పార్టీల పొత్తుతో వైసీపీ పతనం ప్రారంభమైందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు విసుగుచెందారని తగిన బుద్ధి చెప్పక తప్పదన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే..

వరికుంటపాడు: టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర భవిష్యత్తు కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నా యని పార్టీ నియోజకవర్గ నాయకులు గంగవరపు సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన పొత్తు విషయంపై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న అరాచక పాలన నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు ముందుకు రావడం అభినం దనీయమని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి అధికారం చేపట్టడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఆత్మకూరు, మార్చి 9: పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన కె.రామ్‌కుమార్, పి.రమణమ్మ, వి.సీతామహాలక్ష్మి, షేక్ ఇంతి యాజ్, ఆర్.వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆదివారం ఆ కుటుంబసభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున రూ.50వేలు అందజేశారు. ఆయన వెంట ట్రస్ట్ సభ్యులు ఆర్.ప్రసాద్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ త్రివేణి, మాజీ కౌన్సిలర్ దోర్నాదుల సురేష్ బాబు, ఏడో వార్డు ఇన్‌చార్జి జమీర్‌భాష, మెప్మా ఆర్‌సీలు వెంకట సుబ్బమ్మ, శిరీష, సుభాషిని, జబీనా, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం కమిటీ సభ్యులు హజరత్తయ్య, పరిటాల సత్యం పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): ఏరుకొల్లులో వైసీపీ కార్యకర్తలు గుడిపాటి పోలయ్య, షేక్ పెద మస్తాన్‌లు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ సమన్వ యకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆ కుటుంబాలకు రూ.20వేలు ప్రకటించారు. శనివారం ఈ నగదును మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సీనియర్ నాయకుడు లెక్కల పెదమాలకొండారెడ్డి బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో దుత్తలూరు-2 ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు చేజర్ల బ్రహ్మారెడ్డి, మధురెడ్డి, రవి శ్రీహరిరెడ్డి, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మాల్యాద్రి లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

కావలి రూరల్, మార్చి9: కావలి చెరువు సమీపంలోని కూచి చినమాల కొండలో స్వామివారి కల్యాణ అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎం. మాధవదాసు కుమారుడు మాల్యాద్రిస్వామి ఆధ్వర్యంలో ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలు మంచాల ప్రసాద్‌నాయుడు-మల్లిక దంపతులు స్వామివారికి పూజల అనంతరం అన్నసంతర్పణ చేశార్లు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లింగసముద్రం : మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్యస్వామిని దర్శించుకోలేని భక్తులు రెండోరోజు శనివారం కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లింగసముద్రంలోని ప్రధాన రహదారిలో భక్తుల రద్దీ నెలకొంది.

అల్లూరు : శివరాత్రి సందర్భంగా మండలంలోని అల్లూరుతోపాటు నార్త మోపూరు, ఇస్కపల్లి శివాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం విశేష పూజల అనంతరం ఇస్కపల్లిలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్యక్రమాలు సాగాయి. ఉదయం మహాపూర్ణాహుతి, కుంభజలాభిషేకం సాయంత్రం రుద్ర త్రిశతీ బిల్వార్చన, లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. శనివారం రాత్రి ఆదిదంపతులకు కల్యాణ ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. బీద గిరిధర్-సుజన దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కావలి రూరల్ : చినమాలకొండలో స్వామివారికి పుష్పాలంకరణ



అల్లూరు : ఆది దంపతులకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఉభయదాతలు



లింగసముద్రంలో కోటయ్యస్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా : కావ్య

కావలి, మార్చి9: ఒక్క అవకాశం ఇవ్వండి.. కావలిని అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో శనివారం కావలిలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాతూరు కృష్ణుడి బొమ్మ సెంటర్‌లో ప్రచారరథంపై నుంచి కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేపై నిప్పులు చెరిగారు. పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలిని దోచుకోవటం తప్ప ఏమి చేశాడని ప్రశ్నించారు. నీ అనుచరుల రియల్ ఎస్టేట్ కోసం పంట కాలువలు, నీటి గుంటలు ఆక్రమించారని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆక్రమణలు తొలగించి కాలువలు, గుంటలు యథావిధిగా ఉండేలా చేసి రైతులకు న్యాయం చేస్తానన్నారు. నీకు అన్నం పెట్టిన పాతూరు గడ్డను కలుషితం చేస్తున్నావన్నారు. నీ అరాచకాలతో కావలి ప్రజలు విసిగిపోయి తనను భారీ మెజార్టీతో గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ మాట్లాడుతూ కావ్య క్రిష్ణారెడ్డి గెలుపు కోసం జనసేన నాయకులు అహర్నిశలు పనిచేస్తారన్నారు. ర్యాలీకి వచ్చిన ప్రజలను చూస్తే విజయోత్సవ ప్రదర్శనలా ఉందని ఆయన పేర్కొన్నారు.



టీడీపీ, జనసేవ నాయకులు, కార్యకర్తల ర్యాలీ

● ర్యాలీకి అపూర్వ స్పందన

టీడీపీ- జనసేనలు చేపట్టిన ర్యాలీకి భారీ స్పందన రావటంతో కావలి పట్టణం పసుపుమయమైంది. ముసునూరులోని టీడీపీ కార్యాలయం నుంచి కావ్యక్రిష్ణారెడ్డి, అళహరి సుధాకర్‌లతోపాటు, టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలతో ట్రంకురోడ్డు మీదుగా మోటారుసైకిల్ ర్యాలీగా బయలు దేరారు. వారి వెంట ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ట్రంకు రోడ్డులో ఉన్న ఎన్టీఆర్, అయ్యపరెడ్డి, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోలేరమ్మ అరుగు వద్ద పోలేరమ్మకి పూజలు చేశారు. కృష్ణ మందిరంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేజీబీవీల్లో ఫిట్‌నెస్ రన్.. విజేతలకు బహుమతులు

కందుకూరు, మార్చి 9: నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోకి కేజీబీవీలో విద్యార్థినులకు ఫిట్‌నెస్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీల్లో ఎం. లక్ష్మి, డి. వెన్నెల, వి. కోమలిలు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి. స్వాతి, పీఈటీ ఎన్. లక్ష్మి, సొసైటీ ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, చక్కా వెంకటకేశవరావు, కొత్తూరి శివకుమార్, ఇన్నమూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని జమీన్‌ఉప్పలపాడు కేజీబీవీలో శనివారం నారీశక్తి ఫిట్‌నెస్ ప్రతినిధి నందిపాటి రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 500 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి డీ మమత, రెండవ బహుమతి ఎం వైష్ణవి, మూడవ బహుమతి మైథిలి గెలుచుకున్నారు. వారికి నిర్వాహకులు టీషర్ట్లు, కప్‌లు, క్యాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక కేజీబీవీలో శనివారం ప్రజాసత్తా ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం (నెల్లూరు) వారి సహకారంతో నారీశక్తి వేడుకలను జరిగాయి. ఈ సందర్భంగా ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ శారీరకంగా, మానసికంగా పూర్తి ఆరోగ్యంతో ఉండాలన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో జీ సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ కే సుప్రియ, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : స్థానిక కేజీబీవీలో శనివారం ఫడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భారత్ నారీశక్తి ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పీవీ రమణయ్య బాలికలకు రన్నింగ్ రేస్, ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు టీషర్ట్లు, టోపీలు అందజేశారు. నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్కే షాహిదా , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 8,65,273

వలేటివారిపాలెం, మార్చి 9 : మండలంలోని మాలకొండ లక్ష్మీరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 8,65,273 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,540, కుంకుమార్చన ద్వారా రూ. 24,600, తలనీలాల ద్వారా రూ. 25,925, వాహనపూజల ద్వారా రూ. 1,920, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,04,600, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 900, రూముఅద్దెల ద్వారా రూ. 26,620, కవర్లు ద్వారా రూ. 5,700, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,12,115, అన్నదానం ద్వారా రూ. 3,13,225, విరాళాల ద్వారా రూ. 42,218 ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలా ?



మాట్లాడుతున్న మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, మార్చి 9: సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు చేస్తూ కించపరచేలా మాట్లాడం సరికాదని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు అన్నారు. బోగోలులోని టీడీపీ మండల కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందు నిందలు వేసి నోరు మూయించేలా చేస్తున్నారని అన్నారు. చెంచులక్ష్మీపురంలో మా తండ్రి కొనుగోలు చేసి ఇచ్చిన భూమిని కూడా ఆక్రమించుకున్నారని వైసీపీ నేతలు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వెంకటేశ్వర్లురెడ్డి, రఘురాంనాయుడు, సుధీర్‌బాబు, అంజయ్యయాదవ్, మాధవరావు, హర్ష, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

● కొత్తూరులో శంఖారావం

బోగోలు మండలం కొత్తూరు గ్రామంలో శనివారం రాత్రి శంఖారావం కార్యక్రమాన్ని మండల టీడీపీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వారు వివరించారు. కార్యక్రమంలో ఎల్ సుధీర్, జయరాజు, నరసింహారావు, హరిబాబు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కాకర్లను కలసిన సత్యవోలు నేతలు

కొండాపురం : ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం సత్యవోలు పంచాయతీ టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గద్దె రామక్రిష్ణ అధ్వర్యంలో వారు కాకర్లను సన్మానించారు. ఆయన వెంట నాయకులు గద్దె రాఘయ్య, గోరంట్ల నరసింహులు, మందపల్లి మాధవరావు, వేణు పలువురు యువత ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం : మండలంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను కందుకూరు సెబ్ అధికారులు, సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు.ముందుగా అందిన సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సెబ్ సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది గ్రామ సమీపంలోని మన్నేరులో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.సీఐ వెంకటేశ్వర్లు ఈ సంఘటనపై ఫిర్యాదు చేయగా, ఎస్సై ఎం బాజీబాబు కేసు నమోదు చేశారు.

మల్లన్నకు నందివాహన సేవ

కావలిటౌన్, మార్చి9: పట్టణంలోని పాతూరులోగల శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మల్లన్నకు నందివాహన సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, హోమం పూజలు, బలిహరణ, పల్లకి సేవలు నిర్వహించారు. సాయంత్రం తెనాలి వాస్తవ్యులు విశ్వనాథశాస్త్రి శివలీలల ప్రవచనాలు చేశారు. తెల్లవారుజామున ఒంటిగంటకు జరిగిన లింగోద్భవ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి మల్లన్నకు నందివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.



నందివాహనంపై మల్లన్న ఊరేగింపు

వైభవంగా శ్రీనివాస కల్యాణం

కావలి పట్టణ ముసునూరులోని హనుమత్‌క్షేత్రంలో శనివారం శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో అర్చక స్వాములు నిర్వహించిన ఈ మహోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల తెప్పోత్సవం

బిట్రగుంట, మార్చి 9: బోగోలు మండలం నాగులవరం పంచాయతీలో వెలసి ఉన్న గంగాపార్వతీ సమేత నాగలింగేశ్వర స్వామికి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ, శివపార్వతుల ఏకాంత సేవను నిర్వహించారు.



తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

లక్ష్మీనరసింహుడి సేవలో ఇంటూరి దంపతులు

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరావు- సౌజన్య దంపతులు దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చ కులు గౌరీశంకర్ అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం నాగేశ్వరరావును శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కామినేని అశోక్ తదితరులు ఉన్నారు.



మాలకొండపై స్వామివారి దర్శనానికి వెళ్తున్న నాగేశ్వరరావు దంపతులు

● మాలకొండలో బుర్రా మధుసూదన్

మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం కందుకూరు వైసీపీ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు పరిటాల వీరాస్వామి, అనుమోల వెంకటే శ్వర్లు, కట్టా హనుమంతరావు, కుంబాల క్రాంతికుమార్, సీహెచ్ ఓబులుకొండయ్య, పీ అంజయ్య, బాపతు మాలకొండారెడ్డి ఉన్నారు.



మాలకొండపై బుర్రా మధు తదితరులు

నేడు కందుకూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, మార్చి 9: పట్టణంలోని విక్కిరాలపేట రోడ్డులో ఆదివారం విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా పలుప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. సంతోష్‌నగర్, మక్కా మసీదు, బూడిదపాలెం, పాత బ్యాంకు బజారు, కోటకట్ట వీధి, వెంకటనారాయణ బజారు, పెద్దబజారు, ఆర్డీవో కార్యాలయం ఎదురు, వాణినగర్, ఆర్ అండ్ బీ బంగ్లా, పెట్రోలుబంకుల ఏరియా, వాసవీనగర్, ప్రకాశం కాలనీ, రెవిన్యూ కాలనీ, సీటీఆర్ఐ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

దేగపూడి - బండేపల్లి కాలువ పూర్తి చేస్తాం : సోమిరెడ్డి


టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

మనుబోలు, మార్చి 9 : అధికారంలోకి వచ్చిన వెంటనే దేగపూడి-బండేపల్లి కాలువను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని వీరంపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం బాబు షూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు కలిసి విజయం సాధించడం ఖాయమని, మంత్రి కాకాణిని ఓడించి ఇంటికి పంపించడానికి సర్వేపల్లి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాకాణి బండేపల్లి కాలువను పూర్తి చేసిన తర్వాతే 2024లో జరిగే ఎన్నికల్లో మనుబోలు మండలంలో ఓట్లు అడుగుతానని వాగ్దానం చేశారని, ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవడంలో విఫలం చెందారంటూ దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ నాయకుల అవినీతిపై విచారణ జరిపించి దోపిడీ సొమ్మును కక్కిస్తామన్నారు.

పలువురు టీడీపీలో చేరిక

మనుబోలు మండలంలోని వీరంపల్లి గ్రామంలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు శనివారం సాయంత్రం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరికి సోమిరెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గాలి రామకృష్ణారెడ్డి, వర్ధినేని మస్తాన్‌నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, చల్లగిరి చిట్టిబాబు, ప్రసాద్, నల్లజర్ల సునీల్, యద్దలపూడి సురేష్, గొంతు భోగరాజు, బొనికి పరంధామయ్య, రాఘరామయ్య, బొనికి రవి, ప్రభాకర్, పెంచలయ్య, మల్లికార్జున్‌నాయుడు, అంజనేయులు, కోదండరామిరెడ్డి తదితరులున్నారు.

నందీశ్వరుడిపై రామలింగేశ్వరుడి విహారం


నందివాహనంపై దర్శనమిస్తున్న రామలింగేశ్వరుడు

పొదలకూరు, మార్చి 9: పట్టణంలోని పురాతన శివాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 12గంటల తర్వాత రామలింగేశ్వరుడు నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రైతు సంఘం నాయకులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. శనివారం సాయంత్రం గిన్నెభిక్ష కార్యక్రమం జరిగింది. ఉభయకర్తలుగా సీసీఆర్ ప్రసాద్, ఎ కృష్ణమూర్తి, ఎం రాజశేఖర్, పీబీఎస్‌వీ ప్రసాదరావు, బి గోపాలకృష్ణమాచార్యులు వ్యవహరించారు. ఆదివారం ఉదయం శివాలయంలో శివపార్వతుల కళ్యాణాన్ని ఆర్యవైశ్య సంఘం వారు నిర్వహిస్తారు.

నేత్రపర్వంగా గిన్నెభిక్ష


గిన్నెభిక్షలో స్వామివారు

మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం పట్టణ పురవీధుల్లో చేపట్టిన గిన్నెభిక్ష నేత్రపర్వంగా సాగింది. ఇళ్ల వద్దకు వచ్చిన స్వామివారికి భక్తులు కాయా కర్పూరం సమర్పించి గిన్నెలో భిక్ష వేశారు. పుర వీధులన్నీ శివనామ స్మరణతో మారుమోగాయి. పొదలకూరు మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కళ్యాణానికి ముందురోజు స్వామివారు గిన్నెభిక్ష కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది.

గరుడ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడి దర్శనం


గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 9: రామకృష్ణానగర్‌లో కొలువైవున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా శనివారం బుచ్చి పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో గిన్నెభిక్ష ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమాలకు పందిళ్ళపల్లి శ్రీరాములురెడ్డి, గణేశం శ్రీనివాసులురెడ్డి, ఆదూరు శ్రీనివాసులు కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ పండితులు, పాలకవర్గం కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా, బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరగనుంది.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు..!



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూనపూర్ణ

నెల్లూరు (హరనాథ పురం), మార్చి 9: మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ప్రముఖ శ్వాసకోసవ్యాధి నిపుణులు డాక్టర్ ప్రసూనపూర్ణ అన్నారు. శనివారం నగరంలోని బ్రాహ్మణసేవాసంఘ భవనంలో ఆ సంఘ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో అడ్వకేటు పీవీ కమలాక్షమ్మ, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, రచయిత శ్రీరామగిరి శ్రీలక్షమ్మ, డాక్టర్ ప్రసూనపూర్ణలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు శనగవరపు సత్యనారాయణమూర్తి, కార్యదర్శి మామిళ్లపల్లి కాంతారావు, కోశాధికారి చాకలకొండ సత్యనారాయణరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో

నెల్లూరు(విద్య): నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు కేవలం పుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలే కాకుండా సమాజాన్ని అధ్యయనం చేసే దిశగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పలు రంగాల్లో సేవలందించిన మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుసుమకుమారి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షేక్.మస్తాన్‌బీ, నేతలు డి.అన్నపూర్ణమ్మ, గాయత్రి, రాజమ్మ, టి.భాగ్యమ్మ, కామాక్షి, తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో

నెల్లూరు(సాంస్కృతికం) : నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న నర్సరీలో శనివారం నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం జరిగింది. వివిధ రంగాలలో ప్రతిభావంతులైన కృష్ణవేణి (విద్యావేత్త), సుధామురళి (కవయిత్రి), చేజర్ల వినయ్ (గాయని), డాక్టర్ శైలజా ఏకాంబరాలకు ఘన సత్కారాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, కార్యదర్శి సందడి అరుణలు పర్యవేక్షించారు.

కొమ్మలపూడిలో అభివృద్ధి పనుల ప్రారంభం


అభివృద్ధి పథకాలను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు, మార్చి 9 : మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ప్రారంభోత్సవం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలందరూ ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, ఎంపీటీసీ శిరీష, సర్పంచ్ వేణుగోపాల్, వ్యవసాయ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, నాయకులు హరగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ చేయూత సంబరాలు

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట సమీపంలోని శ్రీడ్స్ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి వైఎస్ఆర్ చేయూత సంబరాలు నిర్వహించారు. ఆయన మాటాడుతూ చేయూత లబ్ధిదారులు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత చేయూత నగదు మెగా చెక్కును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి, నాయకులు మందల వెంకటశేషయ్య, కనుపూరు కోదండరామిరెడ్డి, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, కొణిదెల భాస్కర్‌నాయుడు తదితరులున్నారు.

ఉచిత నిర్బంధ విద్య అమలు చేయాలి

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 9 : రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోల్లో 18 ఏళ్ల వరకు ఉచిత నిర్బంధ విద్య అమలు చేస్తామని హామీ ఇవ్వాలని చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ ఐ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం బాల్య వివాహాల ప్రాబల్యంలో వలన జాతీయ ఆరోగ్య సర్వే ప్రకారం 23.3శాతం మంది విద్యార్థినులు బాల్య వివాహాలు చేసుకున్నారని తేలింది. అందువల్ల స్త్రీలలో అక్షరాస్యతా శాతం తగ్గిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి ముగ్గురిలో ఇద్దరికి బాల్య వివాహాలు జరుగుతున్నాయని, 52 లక్షల మంది ఆడపిల్లలు ఉంటే 33లక్షల మంది బాల్య వివాహాలలోకి నెట్టబడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 9 : నగరంలోని పొగతోట ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో ఆదివారం నుంచి డాక్టర్ గిరిజాలక్ష్మిచే ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని ధ్యాన మండలి, సీవీఎల్ నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు.

అనాధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం పంపిణీ


వృద్ధులకు అల్పాహార ప్యాకెట్లు, పండ్లు అందజేస్తున్న ఇబ్రాయిల్

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 9: మండలంలోని రేబాల గ్రామంలో ఆశాదీప్ అనాధాశ్రమంలో వృద్ధులకు క్రీమ్ స్వచ్ఛందసేవా సంస్థ అధ్యక్షుడు తడిసిన ఇబ్రయిల్ శనివారం అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధులు, ఆశ్రమ నిర్వాహకులు శేషాద్రి పాల్గొన్నారు.

హైలెవెల్ వంతెన నిర్మించి ప్రజల కల నెరవేరుస్తాం : బొబ్బేపల్లి


వంతెనను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

వెంకటాచలం, మార్చి 9: వైసీపీ ప్రభుత్వంలో కలగానే మిగిలిన తిరుమలమ్మ పాళెం హైలెవెల్ వంతెన నిర్మాణం రానున్న జనసేన, టీడీపీల ఉమ్మడి ప్రజాప్రభుత్వంలో చేసి చూపిస్తామని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు హామీ ఇచ్చారు. మండలంలోని తిరుమల మ్మ పాళెం వంతెనను శనివారం స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాటల గారడీ చేశారే తప్ప ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేక పోయాయరని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాకాణిని సర్వేపల్లి ప్రజలు ఓడించి ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణిభవాని, సందూరు శ్రీహరి, షేక్ రహీమ్, అక్బర్, మస్తానయ్య, సుమన్, విజయ్, హరి, షణ్ముఖ, శరత్ తదితరులున్నారు.

అనియత బోధకులు దరఖాస్తు చేసుకోవాలి

పొదలకూరు, మార్చి 9 : రాష్ట్రంలో గతంలో తొలగించిన అనియత విద్యా బోధకులు, సూపర్‌వైజర్లు తమ విద్యార్హతలు, ఆధార్‌కార్డు, సర్వీస్ సర్టిఫికెట్లు వివరాలతో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అనియత విద్య రాష్ట్ర కార్యదర్శి కెవీ రమణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 94933 56981 నెంబరు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

బరువు నియంత్రణపై అవగాహన

నెల్లూరు(విద్య), మార్చి 9 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బరువు నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎముకలు, కీళ్ల వ్యాధుల నిపుణులు డాక్టర్ శ్యాంప్రసాద్ శశాంక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ శరీర బరువును అదుపులో ఉంచుకోవాలన్నారు. శరీరం బరువు పెరిగితే మోకాళ్లపై భారం పడి ఎముకలు, కీళ్ల వ్యాధులు వచ్చే ప్రమాదముందన్నారు. మోకాళ్లను బలంగా ఉంచేందుకు వ్యాయామం చేయడంతో పాటు ఆహార నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి కే.జయదేవ్, అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, చింతల అమరేంద్రరెడ్డి, నేతలు రాఘవేంద్రషెట్టి, పొన్నం రవిచంద్ర, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ), మార్చి 9 : నగరంలోని మూలపేట మూలస్థానేశ్వర స్వామి రథోత్సవం జరుగుతున్నందున ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామయ్యబడి 11 కేవీ, రాజావారి వీధి 11 కేవీ ఫీడర్లల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నగర విద్యుత్ శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూలపేట, రాజావారివీధి, పల్లెమిట్ట, చాముండివారి తోట, కొండదిబ్బ, బ్రహ్మణ వీధి, శాంతినగర్, శివాలయం వీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు. అలాగే ఇరుకళల పరమేశ్వరి దేవాలయం సబ్ స్టేషన్ పరిధిలో నవబాల 11కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా నిలిపి వేస్తున్నామని, శివగిరి కాలనీ, రాజీవ్ స్వగృహ, సాయి నగర్, ఇరుకలమ్మ సంఘం ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

కమనీయం ఆదిదంపతుల కల్యాణం


రాజరాజేశ్వరి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 9 : శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రాజరాజేశ్వరి ఆలయంలో మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అలంకారం, పూజలు జరిగాయి. రాజరాజేశ్వరికి నిత్యపూజలు, విశేష అలంకారం జరిగింది. భారీ కల్యాణ వేదిక సెట్టింగ్ ఆకట్టుకుంది. ప్రధాన అర్చకులు రఘురామమూర్తి, వేదపండితులు రామకృష్ణ, అర్చకులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణానికి ఆల్తూరి సులోచనమ్మ, ఆల్తూరి గిరీష్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ జే.వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

- సుజాతమ్మకాలనీ అష్టలక్ష్మీ ఆలయంలో ఉమాదేవి, నాగేశ్వరస్వామిల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ శివపార్వతుల కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు.
- వాహబ్‌పేటలోని ఉమామహేశ్వరస్వామి కల్యాణ వేడుకలు కనుల పండువగా జరిగాయి. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూలంగిసేవ, ప్రత్యేక అలంకారాల, అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉభయకర్తలు, ధర్మకర్తలు ఎన్‌సీ.బాలాజీసింగ్, జీసీ ధర్మసింగ్, ఈవో బి.మల్లికార్జున్‌రెడ్డి పర్యవేక్షించారు.
- వేదాయపాలెం త్యాగరాజస్వామి ఆలయంలో ఉదయం తులసి, మారేడు, నిమ్మ, ఉసిరి, వావిలకులతో అభిషేకం, అర్చనలు జరిగాయి. రాత్రి కమలాంబిక సమేత త్యాగరాజేశ్వరస్వామిలకు విశేష అర్చనలు అనంతరం శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది.
- మూలాపేట అన్నపూర్ణా సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో విశేషంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.
- నగరంలోని వైకుంఠపురం కాశీనాయక ఆశ్రమంలో శివపార్వతుల కల్యాణం, శాంతి హోమాలు జరిగాయి. భక్తులకు 32 రకాల వంటకాలతో పెండ్లి విందు భోజనం జరిగింది. ఈ కార్యక్రమాలు మువ్వా ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు ధన్వి శ్రీనివాస్, మహంకాళీ వెంకటేష్, మహేష్, వెంకటేశ్వర్లు నాయుడు, నాగూర్, చెన్నకృష్ణ, గణేష్, సిద్ధు, నవీన్‌లు పర్యవేక్షించారు.

శివరాత్రి ఉత్సవాలు నేడు..

- మూలాపేట మూలస్థానేశ్వరస్వామికి నీలకంఠేశ్వరస్వామిలకు ఉదయం 9గంటలకు రథోత్సవం జరుగుతుంది.
- త్యాగరాజ స్వామి మందిరంలో ఉదయం 7గంటలకు అభిషేకాలు, సాయంత్రం ప్రదోషకాల పూజలు, రాత్రికి ఏకాంత సేవ, పుష్పార్చనలు.
- రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ధ్వజావరోహణం, స్వామివారికి ప్రాకారోత్సవంలు జరుగుతాయి.

ఎనెల్ ఆసుపత్రిలో అరుదైన వ్యాధికి శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ గిరిమహేష్

నెల్లూరు (వైద్యం), మార్చి 9 : నెల్లూరు నగరంలోని ఎనెల్ ఆసుపత్రిలో తిస్థియోతిర్థ్రైటిస్ అనే అరుదైన వ్యాధికి శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గిరి మహేష్ మాట్లాడారు. నెల్లూరుకు చెందిన మహమ్మద్ రఫీ తీవ్రమైన ఎడమ కాలి నొప్పితో రెండేళ్లుగా బాధపడుతున్నారన్నారు. ఆయనకు పరీక్షలు నిర్వహించి తిస్థియోతిర్థ్రైటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నారని గుర్తించి ఈహెచ్‌ఎస్ ద్వారా ఆసుపత్రిలో ఉచితంగా మోకీలు మార్పిడి చేశామని వెల్లడించారు. ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ విభాగాలలో ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్, రోగి మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

- మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్


మొక్కకు నీరు పోస్తున్న శివరాజ్‌సింగ్ చౌహాన్

నెల్లూరు(వైద్యం), మార్చి 9: ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడించారు. శనివారం నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో వాతావరణంలో అనేక మార్పులు సంభవించి మనిషి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతిని కాపాడేందుకు మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రకృతి ప్రేమికులు ఈ విషయంపై విస్తృత ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులు ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కోసం చెట్లు ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇందుకోసం జీజీహెచ్ ప్రాంగణంలో మొక్కలు నాటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర నేత సురేంద్రరెడ్డి, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నక్షత్ర'లో వైజ్ఞానిక ప్రదర్శన

నెల్లూరు(విద్య), మార్చి 9 : నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న నక్షత్ర పాఠశాలలో శనివారం వాల్యెజ్‌ఫేర్ పేరుతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కరస్పాండెంట్ సంధ్యారెడ్డి మాట్లాడుతూ చిన్నారుల్లో దాగివున్న సృజనాత్మ కతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించా మన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ సందీప్‌రెడ్డి, జీవన్ కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రజ్ఞ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

- యువతకు నారాయణ పిలుపు


టీడీపీలో చేరిన వారితో నారాయణ, కోటంరెడ్డి

నెల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయానికి యువత కృషి చేయాలని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరిన వారికి నారాయణ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నగరాధ్యక్షుడు మామిడాల మధు, క్లస్టర్ ఇన్‌చార్జ్ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో రమాదేవి పర్యటన

40వ డివిజన్‌లో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పాల్గొన్నారు. ఇరుకళల పరమేశ్వరి దేవాలయం, నాలుగు రోడ్ల సెంటర్, వాకర్స్ రోడ్ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.

శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలోకి దొంతాలి ఎంపీటీసీ



నెల్లూరు రూరల్ మండలం దొంతాలి ఎంపీ టీసీ చండి అరుణమ్మ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం నెల్లూరులోని టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో ఆయన సమక్షంలో టీడీపీ జెండా కప్పుకున్నారు. అలానే దొంతాలి గ్రామం వైసీపీ కీలక నేత చండి శంకరయ్య యాదవ్ తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. కొత్త వెల్లంటికి చెందిన శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డిలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీరందరికీ శ్రీధర్‌రెడ్డి కండు వాలు కప్పి స్వాగతం పలికారు.


మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి

మూడు పార్టీల పొత్తుతో వైసీపీలో వణుకు

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి

నెల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ-జనసేన-బీజేపీ కలయికతో వైసీపీలో వణుకు మొదలైందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని 51వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలతో వైసీపీ పూర్తిగా భూస్థాపితం అవుతుందని విమర్శించారు. మూడు పార్టీల పొత్తు రాష్ట్రంలో చరిత్ర సృష్టించబోతోందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో ఆఖరుకు చెత్తపై కూడా పన్ను వేశారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క పన్ను కూడా పెంచకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో చంద్రబాబు నడిపిస్తారని చెప్పారు. నుడా ద్వారా గతంలో ఏ విధంగా అభివృద్ధి చేశామో, అంతకు రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, సాత్విక్, విష్ణు, మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సుపరిపాలన కోసమే పొత్తు

నెల్లూరు(వైద్యం) : ప్రజలకు సుపరిపాలన అందించటం కోసమే జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని మాజీమంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ వెల్లడించారు. శనివారం 4, 10 డివిజన్‌ల పరిధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఎన్నికలలో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఒక్క చాన్స్ ఇచ్చి ప్రజలు నష్టపోయారు : అజీజ్

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 9: జగన్‌రెడ్డికి ఒక్క చాన్స్ ఇచ్చి ప్రజలు తీవ్రంగా నష్టపోయారని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. 54వ డివిజన్ బర్మాషాల్ గుంటలో శనివారం ఆయన బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించక పోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని సూచించారు. మాజీ మంత్రి నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహీర్‌బాషా, షాహిద్, ఇబ్రహీం, మహబూబ్ బాషా, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నారీశక్తి ఫిట్‌నెస్ రన్

నెల్లూరు(విద్య), మార్చి 9 : నెహ్రూ యువకేంద్రం సౌజన్యంతో సీపీఅండ్‌పీహెచ్‌పీడబ్ల్యూఏ ఆధ్వర్యంలో నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం నర్సింగ్ విద్యార్థినులకు నిర్వహించిన నారీశక్తి ఫిట్‌నెస్ రన్ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌వైకే అధికారి డాక్టర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగానే నారీశక్తి ఫిట్‌నెస్ రన్ నిర్వహించగా నర్సింగ్ విద్యార్థినులు పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. అనంతరం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన బి.లక్ష్మి, పి.రూప, ఎస్.పావనిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా పీహెచ్‌సీ నాయకుడు శాఖవరపు వేణుగోపాల్, జడ్పీ వాకర్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, రూప్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్.రసూల్, సభ్యులు శేషయ్య, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200